## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పొన్నూరు: వైఎస్సార్ సీపీ పొన్నూరు పట్టణం , మండల స్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

### చెరువుల్లా దర్శనమిస్తోన్న రహదారులు



ప్రత్తిపాడు: చిన్నపాటి వర్షానికే ఆర్అండ్బీ రహదారులు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి వట్టిచెరుకూరులోని మెయిన్ రోడ్డు ఇలా తటాకంలా మారిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, ప్రధాన రహదారిలోని కల్వర్టు వద్ద నీటి పారుదల సవ్యంగా లేకపోవడంతో మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ నీటిలోనే ప్రయాణిస్తూ ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆర్అండ్బీ రోడ్డు అనే సాకును చూపుతూ పంచాయతీ అధికారులు కూడా కల్వర్టు, రోడ్డు బాగోగులు పట్టించుకోకుండా ఉంటుండటంతో వర్షాలు కురిసిన ప్రతి సారీ ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతుందన్న విమర్శలు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

### 260 మందికి వైద్యపరీక్షలు



తెనాలి: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో తమ వంతుగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్ కుమార్ అన్నారు. స్థానిక నాజరు పేట పుట్టా రాఘవయ్య రైస్ మిల్ సమీపంలోని తిరుపతమ్మ తల్లి గుడి వద్ద సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, అమరావతి సర్జికల్ కార్పొరేషన్, సుజాత హెల్త్ క్లినిక్, సిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ పి.శ్రావణి 260 మందికి పైగా రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, గ్యాస్ సంబంధిత పరీక్షలు నిర్వహించి రూ. 80 వేల విలువైన మందులను సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి బి.సుధాకర్, సభ్యులు ఏవీ సత్యదేవ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మాదల పూర్ణచంద్రరావు, గంజి శివ భుజంగ ప్రభాకరరావు, గోపి పాల్గొన్నారు.

### వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



మంగళగిరి టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్‌లకు మంగళగిరి నగరంలోని వివిధ జమాత్‌లకు చెందిన ముస్లిం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబర్‌స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామని, నగరంలో 20 ఏళ్లుగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతిపాదనపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని వివరించినట్లు తెలిపారు. ఈ ఖబర్‌స్థాన్ వక్ఫ్‌బోర్డు నోటిఫై చేసిన స్థలం కావడంతో దీని పరరక్షణ కూడా వక్ఫ్‌బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వినతిపత్రంలో కోరామని పేర్కొన్నారు.

### హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో శ్రమదానం

తాడేపల్లి రూరల్: సీతానగరం బోటు యార్డ్ దగ్గర నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గం పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయింది. దీంతో ఆదివారం స్థానికులు, విద్యార్థినీ విద్యార్థులు శ్రమదానం చేసి దారిని శుభ్రం చేశారు. పాఠశాలకు వెళ్లి రావడానికి ఇబ్బంది కరంగా ఉండడంతో స్థానికుల సహకారంతో విద్యార్థులు శ్రమదానం చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మేరి, కొండలు, పల్లవి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు!

- మెళకువలు తెలుసుకుంటే మంచి దిగుబడులు
- సూచనల పాటింపుతో లాభాలు పొందొచ్చని అంటున్న నిపుణులు



ఆరుతడి వరిపంట

గుంటూరు రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి పద్ధతిలో వరిసాగు చేపట్టారు. వరి ప్రస్తుతం మొలక దశ నుంచి 10 రోజుల వయస్సులో ఉంది. ఈ పరిస్థితులలో ఆరుతడి వరిలో తగిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

**నత్రజని ఎరువును ఎప్పుడు వేయాలి..**

ఆరుతడి వరిలో దమ్ములో నత్రజని ఎరువులు వేయకుండా కేవలం భాస్వరం ఎరువు మొత్తం మోతాదును, పొటాష్ ఎరువు సిఫారసు చేసిన మోతాదులో సగం మాత్రమే ఆఖరి దుక్కిలో వేయాలి. మిగిలిన సగభాగం పొటాష్ ఎరువును నత్రజని ఎరువుతో పాటు, అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. ఆఖరి దుక్కిలో లేదా విత్తేటప్పుడు గానీ నత్రజనిని వేస్తే కలుపు ఎక్కువగా వస్తుంది. కాబట్టి ఆ సమయంలో నత్రజని ఇచ్చే ఎరువులను వేయకూడదు. నత్రజని ఎరువును మూడు దఫాలుగా విత్తిన 15 రోజులు, పిలక దశ, అంకురం దశలలో వేయాలి.

**ఇనుప ధాతు లోపం ఉంటే..**

ఆరుతడి వరిలో ఇనుప ధాతు లోపం ఎక్కువగా వస్తుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు గమనించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇనుప ధాతువు లోపించడంతో ఆకులు తెల్లగా పాలిపోయినట్లు ఉండి ఎదుగుదల కుంటుపడుతుంది. ఈ ఇనుప ధాతువు లోపం గుర్తించిన వెంటనే లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేదిని రెండు గ్రాముల నిమ్మ ఉప్పుతో కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే వారం రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి. ఆరుతడి వరిలో జింక్ ధాతు లోపం వస్తే 20 నుంచి 25 రోజుల తర్వాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి.

**కలుపు మందు ఎప్పుడు వాడాలి..**

ఆరుతడి పద్ధతిలో వరి విత్తిన వెంటనే భూమిలో తగు తేమ ఉండే పరిస్థితులలో కలుపు మందు వాడాలి. ఒక ఎకరానికి ఒక లీటరు పెండిమిథాలిన్ లేదా 500 మిల్లీ లీటర్ల ప్రిటిలాక్లోర్, సేఫనర్ లేదా 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ వంటి వాటిలో ఏదో ఒక మందును 200 లీటర్ల నీటిలో కలిపి భూమిపై విత్తిన 2–3 రోజుల లోపల పిచికారీ చేయాలి. విత్తిన 15 నుంచి 20 రోజులకు కలుపు ఉద్ధృతిని బట్టి బిస్ పైరిబాక్ సోడియం అనే కలుపు మందును ఎకరాకు 120 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. విత్తిన 20–25 రోజులప్పుడు వెడల్పాటి ఆకు జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే 2, 4 డి సోడియం సాల్ట్ రెండు గ్రాములు లీటరు నీటిలో లేదా 2, 4 డి అమైన్ సాల్టు రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**మంచి దిగుబడులు సాధించవచ్చు..**



ఆరుతడి వరి సాగులో రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అధికారుల సూచనలు మేరకు మాత్రమే పిచికారీ చేయాలి. పంటకు వచ్చిన తెగుళ్లు, సమస్యలపై శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చు.

– శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు, లాంఫాం ఏరువాక కేంద్రం

## అల్లుకుపోతున్న నిర్లక్ష్యం!



**విద్యుత్‌శాఖ అధికారులు, లైన్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు వారాలకోసారి మెయింటెనెన్స్ పేరుతో కరెంటు కోతలు విధించే ఆ శాఖ అధికారులకు వారి కార్యాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకుంటున్న తీగలు కనిపించడంలేదు. అసలే వర్షాకాలం.. విద్యుత్ తీగలకు ఇలా తీగలు పాకడంతో ప్రమాదమేనని స్థానికులు వాపోతున్నారు. గుంటూరు, పర్చూరు రోడ్డు వెంబడి ఇలా పిచ్చిమొక్కలు ట్రాన్స్‌ఫార్మర్‌పై పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడం పలు విమర్శలకు దారితీస్తుంది.**

– ప్రత్తిపాడు

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పెదకాకాని: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారము ఆదివారం నిర్వహించారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో జరిగిన ప్రచారంలో హిందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడారు. శ్రీకృష్ణుడిని అందరూ దైవంగా గుర్తించాలన్నారు. కృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవన్నారు. కార్యక్రమంలో షేక్ దిల్షా, టీవీ కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, శ్రీను, బి.శివలింగం, టి.బ్రహ్మం, బి.రామోజీనాయక్, జె.హరిబాబు, పణిదరం శివ, అములోతు అన్నపూర్ణ, మౌనిక పాల్గొన్నారు.

## మత్తుతో జీవితాలు చిత్తు



పెదకాకాని(ఏఎన్‌యూ): సిరా చుక్క మౌనం వహిస్తే మద్యం చుక్క మత్తు జీవితాలను చిత్తు చేస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు పాలం నాసరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌యూ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ ఖాళీ మద్యం సీసాలు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు కారణమైన బాధ్యులను గుర్తించి వారిపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సీసాలు ఎక్కడబడితే అక్కడ దర్శనాలు ఇస్తుంటే యాజమాన్యానికి ఇది ఏమాత్రం కనిపించకపోవడం బాధాకరమని తెలిపారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ఘనంగా శాకంబరి పూజలు



విశేష అలంకరణలో గంగానమ్మ తల్లి



శాకంబరిగా శ్రీ నాగారపమ్మ అమ్మవారు

చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలోని గ్రామదేవత గంగానమ్మ తల్లి అమ్మ వారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి సారేను మేళతాళాలతో మహిళలు ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

పెదకాకాని: గ్రామ దేవత శ్రీనాగారపమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవిగా పూజలందుకున్నారు. అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో శోభాయమానంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ**



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

తెనాలిటౌన్: మానవ సేవే మాధవ సేవని ప్రతి ఒక్కరూ సేవానిరతి కలిగి ఉండాలని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పిలుపునిచ్చారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు టి.శ్రీనివాసరావు, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పాల్గొని వారాహిమాతకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల సేవార్థం ఇటువంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించడం ముదావహమని నిర్వాహకులను అభినందించారు. ఏపీ ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మంచి ఆశయాతో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ పనిచేస్తుందని అభినందించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ అన్వేష్, డాక్టర్ కె.సాయి రాజశేఖర్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ చెరుకూరి జగదీష్, డాక్టర్ బి.పవన్‌కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతో జీవించండి

తెనాలిఅర్బన్: ప్రతి ఒక్కరూ దైవచింతనతో జీవించాలని ఆల్ ఇండియా ది సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ కమాండర్ దాసరి డానియేల్ రాజు పేర్కొన్నారు. కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి తెనాలి వచ్చిన ఆయనకు ఆదివారం ఘనస్వాగతం పలికారు. అనంతరం సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ ద్వారా అనేక చర్చిలను ఏర్పాటు చేసి క్రీస్తు సందేశాలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఏసు క్రీస్తు బోధించిన మార్గంలో నడవాలన్నారు. లెఫ్టినెంట్ కల్నల్‌లు గేరా థామస్, జి.సియోను కుమారి, బి.బెనర్జీ, టి.కోటయ్య, గాలి రవి కుమార్, కె.ఆర్.ఆర్.బాబు, జె.క్రీస్తుదాసు, రాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## గంగానమ్మకు బోనాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కొలువైన గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాటిబండ్ల నారాయణ రావు మాట్లాడుతూ.. శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కారసనేని అంకినీడు, లక్ష్మీ పార్వతి, పాటిబండ్ల నారాయణ రావు, గాయత్రీదేవి, వెంకట సాంబ శివప్రసాదరావు, నాగరాజ కుమారి, మొవ్వ నాగేశ్వర రావు, జె.శివ, పి.గాయత్రీదేవి, కసారినేని సుస్మ, కసుకుర్తి లింగేశ్వరరావు, కసుకుర్తి జయలక్ష్మి, మేడికొండ ఉమామహేశ్వరరావు, నాగ శిరోణి, పరుచూరి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుడికి లగేజీ అప్పగింత



తెనాలిరూరల్: రైలు ప్రయాణంలో అనుకోకుండా పోగొట్టుకున్న లగేజీని తిరిగి ప్రయాణికుడికి రైల్వే పోలీసులు అప్పగించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన సురేంద్ర శనివారం బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లే రైలులో ప్రయాణించారు. వాస్తవానికి సురేంద్ర తెనాలిలో దిగాల్సి ఉంది. కానీ రైలుకు తెనాలిలో హాల్టు లేదు. రైలు తెనాలి స్టేషన్ సమీపంలోకి రాగానే సిగ్నల్ లేని కారణంగా నిదానించింది. ఆ సమయంలో రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించిన సురేంద్ర ముందుగా తన లగేజ్ ని కింద పడేసాడు. తను దిగటానికి ప్రయత్నించేలోగా రైలు బయలుదేరటంతో దిగలేకపోయాడు. విజయవాడ దిగిన అనంతరం తిరిగి తెనాలి రైల్వే పోలీసుల వద్దకు వచ్చి విషయం తెలియజేయడంతో అప్పటికే స్వాధీనం చేసుకున్న లగేజ్ ని సురేంద్రకు అప్పగించారు. ఈ సందర్భంగా జీఆర్పీ పోలీసులకు సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి వైఫల్యాలను ప్రజలకు చాటి చెబుదాం



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ, నాయకులు

- సంక్షేమ రాజ్యం జగనన్న పాలనతోనే సాధ్యం
- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పెదకాకాని సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చాటిచెబుదామని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పెదకాకాని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, చంద్రబాబు రీకాలింగ్ మేనిఫెస్టోపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జున రెడ్డి అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజాగళం పేరుతో సూపర్‌సిక్స్ పథకాలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఐదేళ్లలో రూ.3.30 లక్షలు లబ్ధి చేకూరుతుందని నమ్మించి ఓట్లు వేయించుకున్నారన్నారు. కూటమి ఏడాది పాలనలో ఒక్కరూపాయి కూడా ఇవ్వకపోగా రెండో సంవత్సరం తల్లికి వందనం పేరుతో రూ.13 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగనన్న చూపిన బాటలో నడిచి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు దంతాల శివపార్వతి, షేక్ షహనాజ్, భీమవరపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు సుంకర కృష్ణారెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, శివాబత్తుని దయానంద్, మేడిద పద్మాకర్, షేక్ నజీర్, అమ్మిశెట్టి శివశంకరరావు, మందాళ శివారెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి తోట శ్రీనివాసరావు, ఆలపాటి రాఘవ, పాందుగల కమల్, మేరిగ సుబ్బారావు, గైడు, గుమ్మళ్ల వెంకట్రావు, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, వేల్పుల నాగరాజు, బోజంకుల ఏసోబు, బద్దెపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మిథున్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

**రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు**



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అక్రమమని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్‌యాదవ్ అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుని ఖండిస్తూ నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ చల్లా హనుమంత్ యాదవ్ మాట్లాడుతూ.. మద్యం కేసు పూర్తిగా అక్రమ కేసన్నారు. ప్రజల తరఫున పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెడుతూ వారి గొంతును నొక్కే ప్రయత్నం చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అసలు లేని లిక్కర్ స్కాంను ఉన్నట్లు చూపిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ, బలవంతపు స్టేట్‌మెంట్లు తీసుకుంటూ, ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందన్నారు.

**ఆ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి..**

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు బాపతు వెంకటరమణ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఎంతో కాలం కూటమి ప్రభుత్వం ప్రజామన్ననలు పొందలేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని కేసులో కావాలనే కుట్ర పూరితంగా ఇరికించారన్నారు. మహిళలపై కూటమి ప్రభుత్వానికి ఎంత మాత్రం కనీస గౌరవం లేదన్నారు. మాజీ మంత్రి రోజాపై ఇటీవల కూటమి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు బాపతు గోవింద్ రెడ్డి, గండు నాగరాజు యాదవ్, వాసిమళ్ల రత్నబాబు, బాపతు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధ్వాన రోడ్డులో రాకపోకలకు అవస్థలు!



**పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామంలో అధ్వాన రోడ్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఈ దారిలో తరలిస్తున్నారు. ఫలితంగా రోడ్డుపై పడిన నల్లమట్టి ప్రమాదకరంగా మారుతోంది. చిన్నపాటి వర్షాలకు బురదమయంగా మారి ప్రయాణికులు జారి పడటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిస్థితిని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.**

– పొన్నూరు

## కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారానికి 229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. ఏసీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, కార్మికులు నవనీతం, దానయ్య, గురవయ్య, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.